నమస్తే తెలంగాణ
సూర్యాపేట
5 నల్లగొండ, ఆదివారం 24 డిసెంబర్ 2023 SURYAPET

# సీఎంఆర్ పెనాల్టీ ₹15 కోట్లకు పైనే..

జిల్లాలో 16 డిఫాల్ట్ మిల్లులు.. కోట్లాది రూపాయల బకాయి

పట్టించుకోని అధికారులు.. బకాయిలున్నా మళ్లీ ధాన్యం కేటాయింపు



సూర్యాపేట, డిసెంబర్ 23 (నమస్తే తెలంగాణ) : ప్రభుత్వానికి నిర్ణీత గడువులోపు సీఎంఆర్ అందించాల్సిన మిల్లులు బియ్యాన్ని ఇవ్వకుండా డిఫాల్ట్ అయ్యాయి. అధికారిక లెక్కల ప్రకారం జిల్లాలో 16 డిఫాల్ట్ మిల్లులు ఉండగా.. వాటి నుంచి దాదాపు 15 కోట్ల రూపాయలకు పైనే బకాయిలు ఉన్నట్లు తెలుస్తుంది. నిబంధనల మేరకు డిఫాల్ట్ మిల్లుల నుంచి ప్రభుత్వానికి 25 శాతం అదనంగా బియ్యం చెల్లించాల్సి ఉంటుంది. కానీ.. అధికార యంత్రాంగం ఎందుకు సేకరించడం లేదో.. వాటి పట్ల ఎందుకు కఠినంగా వ్యవహరించడం లేదో అనేక అనుమానాలకు తావిస్తున్నది. డిఫాల్ట్ అయిన మిల్లులకు తిరిగి ధాన్యం ఇవ్వకూడదు. కానీ.. అలాంటి వారికి వందల కోట్ల రూపాయల విలువైన ధాన్యం మళ్లీ మళ్లీ ఎలా ఇచ్చారో అర్థం కాని పరిస్థితి.

రైతులు పండించిన వరి ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేసి మిల్లింగ్ కోసం మిల్లులకు ఇస్తుంటుంది. ప్రతి సీజన్‌లో ధాన్యాన్ని మిల్లులకు ఇస్తే రా రైస్ 67 శాతం, బాయిల్డ్ రైస్ అయితే 68శాతం చొప్పున బియ్యాన్ని తిరిగి ప్రభుత్వానికి గడువులోపు అందించాల్సి ఉంటుంది. ఒకవేళ ఎవరైనా మిల్లరు గడువులోపు అందించని పక్షంలో సదరు మిల్లులను బ్లాక్ లిస్ట్‌లో పెట్టి డిఫాల్ట్ మిల్లుగా ముద్ర వేస్తారు. డిఫాల్ట్ మిల్లుగా రికార్డుల్లోకి ఎక్కితే సీఎంఆర్‌ను 100శాతం వసూలు చేయడంతోపాటు మరో 25 శాతం పెనాల్టీ వసూలు చేయాల్సి ఉంటుంది. ఇలా జిల్లాలో 16 మిల్లులు డిఫాల్ట్‌గా ఉన్నాయి. ఈ మిల్లులు 2019-20 ఆర్థిక సంవత్సరం నుంచి 2022-23 తొలి సీజన్ వరకు ఈ ఏడు సీజన్లలో గడువులోపు సీఎంఆర్ పూర్తి చేయలేదు. కోట్లాది రూపాయల బకాయిలు ఉన్న డిఫాల్ట్ మిల్లుల నుంచి వసూలు కావాల్సిన పెనాల్టీ సీఎంఆర్ బియ్యం ఎప్పుడు వసూలవుతాయో.

### డిఫాల్ట్ మిల్లర్లకు మళ్లీ మళ్లీ ధాన్యం..

నిబంధనల మేరకు డిఫాల్ట్ మిల్లర్లకు ధాన్యం ఇవ్వకూడదు. కానీ.. జిల్లాలో అలాంటి మిల్లులకు అధికారులు వందల కోట్ల రూపాయల విలువ చేసే ధాన్యాన్ని మళ్లీ మళ్లీ ఇస్తూ వచ్చారు. కొన్ని మిల్లులు రెండు, మూడు సార్లు డిఫాల్ట్ అయినప్పటికీ ధాన్యం ఎలా ఇస్తున్నారో అధికారులకే తెలియాలి. జిల్లాలో డిఫాల్ట్ అయిన 16 మిల్లుల నుంచి రావాల్సిన 25శాతం పెనాల్టీ బియ్యం విలువ దాదాపు రూ.15 కోట్లకు పైనే ఉంటుందనేది అంచనా. ప్రతి సీజన్‌లో ధాన్యం వస్తున్న సమయంలో తొలి, మలి విడుతలో మిల్లులకు కేటాయింపులు చేస్తూ డిఫాల్ట్ మిల్లులకు ఇవ్వమని చెప్తారు. పెద్ద మొత్తంలో మామూళ్లు తీసుకొని మూడో విడుతలో వారికి కూడా ధాన్యం కేటాయిస్తున్నారని ఓ రైస్‌మిల్లరే చెప్తున్నారు. దీనిపై పూర్తి స్థాయిలో విచారణ చేసి 25 శాతం పెనాల్టీ బియ్యాన్ని వసూలు చేయడంతోపాటు అక్రమాలకు పాల్పడిన అధికారులపై చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

# ముక్కోటి వైభవం

భక్తి శ్రద్ధలతో వైకుంఠ ఏకాదశి

- ఉత్తర ద్వారంలో దర్శనమిచ్చిన లక్ష్మీనరసింహుడు
- కిక్కిరిసిన యాదగిరిగుట్ట ఆలయం
- అధ్యయనోత్సవాలకు శ్రీకారం



వైకుంఠ ఏకాదశి సందర్భంగా ఉత్తర ద్వార దర్శనం అనంతరం స్వామివారి ఊరేగింపు

యాదగిరిగుట్ట, డిసెంబర్ 23 : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ప్రధానాలయం, పాత గుట్ట క్షేత్రంలో శనివారం వైకుంఠ (ముక్కోటి) ఏకాదశి వేడుకలను ఘనంగా నిర్వహించారు. స్వామివారు వైకుంఠనాథుడిగా ఉదయం 6.42నుంచి 8గంటల వరకు ఉత్తర ద్వారంలో దర్శనమిచ్చారు. అనంతరం వైకుంఠనాథుడిని గరుఢ వాహనంపై తిరుమాఢవీధుల్లో ఊరేగించారు. వేలాది మంది భక్తులు స్వామివారిని కనులారా వీక్షించి తరించారు. భక్తులతో ప్రధానాలయ ప్రాంగణం కిక్కిరిసింది. కాగా, లక్ష్మీనరసింహస్వామి ప్రధానాలయంలో ఉదయం తొళక్కంతో అధ్యయనోత్సవాలకు శ్రీకారం చుట్టారు. సాయంత్రం విష్ణుమూర్తిని మత్స్యావతారంపై అలంకరించి సేవను ఊరేగించారు. అధ్యయనోత్సవాల్లో భా గంగా స్వామి వారు ఆదివారం ఉదయం వేణుగోపాలస్వామి, సాయంత్రం గోవర్ధనగిరిదారిగా దర్శనమివ్వనున్నారు.



నల్లగొండలో మాజీ ప్రధానమంత్రి పీవీ నరసింహారావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు

# బహుముఖ ప్రజ్ఞాశాలి పీవీ

- శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి
- నల్లగొండలో పీవీ చిత్రపటానికి ఘన నివాళి

రామగిరి, డిసెంబర్ 23 : మాజీ ప్రధాన మంత్రి, దివంగత నేత పీవీ నరసింహారావు బహుముఖ ప్రజ్ఞాశాలి అని శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి కొనియాడారు. నల్లగొండలోని తన క్యాంపు కార్యాలయంలో శనివారం పీవీ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా పీవీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం గుత్తా సుఖేందర్‌రెడ్డి మాట్లాడుతూ పీవీ నర్సింహారావు అనేక భాషల్లో అనర్గళంగా మాట్లాడే గొప్ప మేధావి అన్నారు. ఆయన రాజకీయాల్లోకి వచ్చి ప్రజలకు ఎనలేని సేవ చేశారని తెలిపారు. ప్రధానమంత్రిగా బాధ్యతలు నిర్వహించి తెలుగువాడి ఖ్యాతిని ప్రపంచ స్థాయికి పెంచారని గుర్తుచేశారు. కార్యక్రమంలో కనగల్ జడ్పీ టీసీ చిట్ల వెంకటేశం, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు స్వామిగౌడ్, గోపాల్‌రెడ్డి, వెంకటేశ్వర్‌రావు, హరికృష్ణ, దైద రజితారెడ్డి, రామలచ్చయ్య, వెంకన్న, శ్రీనివాస్, కేశవరెడ్డి పాల్గొన్నారు.

# క్రిస్మస్ సందడి

జిల్లా వ్యాప్తంగా చర్చిలు ముస్తాబు



నల్లగొండలో ముస్తాబైన తెలుగు బాప్టిస్టు చర్చి

*క్రైస్తవులకు పవిత్రమైన పండుగ క్రిస్మస్. ఈ వేడుక వస్తుందంటే చాలు వారం రోజుల ముందు నుంచే సందడి నెలకొంటుంది. ఇప్పటికే క్రైస్తవులు తమ ఇండ్లపై స్టార్స్‌ను వెలిగించారు. ఏసుక్రీస్తు జనన వేదికలైన పాకలకు ఏర్పాట్లు, క్రిస్మస్‌కు ఉపయోగించే వస్తువుల కొనుగోళ్లలో నిమగ్నమయ్యారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రధాన చర్చిలను విద్యుద్దీపాలతో అలంకరించారు. కాగా, ముందస్తుగా పలుచోట్ల మినీ క్రిస్మస్ సంబురాలను ఘనంగా నిర్వహిస్తున్నారు.*

# అర్హులకు మోడల్ కాలనీ ఇండ్లు

- మూడు నెలల్లో పూర్తి చేసి పంపిణీ చేస్తాం
- లిఫ్ట్‌లను పునరుద్ధరించాలని అధికారులకు ఆదేశం
- మంత్రులు ఉత్తమ్ కుమార్‌రెడ్డి, పొంగులేటి



హుజూర్‌నగర్‌లో మాట్లాడుతున్న మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి, వేదికపై మంత్రి పొంగులేటి

హుజూర్‌నగర్, డిసెంబర్ 23 : హుజూర్‌నగర్ మోడల్ కాలనీలోని ఇండ్లను మూడు నెలల్లో పూర్తి చేసి అర్హులైన పేదలకు అందజేస్తామని భారీ నీటి పారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి, రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. హుజూర్‌నగర్ పట్టణంలో అసంపూర్తిగా నిలిచిపోయిన మోడల్ కాలనీ ఇండ్లను శనివారం పరిశీలించారు. అనంతరం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. రాష్ట్రంలో పైలట్ ప్రాజెక్టుగా తీసుకొని హుజూర్‌నగర్‌లోని 2,160 ఇండ్లను గ్రామ సభలో లబ్ధిదారులను ఎంపిక చేసి పంపిణీ చేస్తామని హామీ ఇచ్చారు. మిగిలిన 33 ఎకరాల్లో కొత్త ఇండ్ల నిర్మాణానికి శ్రీకారం చుడుతామని చెప్పారు. పేదలకు అత్యధిక ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేసిన ఘనత కాంగ్రెస్‌దేనని పేర్కొన్నారు. రాష్ట్రంలో ఆక్రమణకు గురైన భూములను స్వాధీనం చేసుకుంటామని, అన్ని వర్గాల ప్రజలకు మేలు చేస్తామని హామీ ఇచ్చారు. కోదాడ, హుజూర్‌నగర్ నియోజకవర్గాల్లోని లిఫ్ట్‌లను పునరుద్ధరించాలని అధికారులను ఆదేశించారు. అందుకు సంబంధించిన నిధులను తక్షణమే మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రజలు చారిత్రాత్మకమైన తీర్పునిచ్చారని, ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారెంటీల అమలుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తున్నదని అన్నారు.

అంతకుముందు క్యాంప్ కార్యాలయంలో నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలుపై కలెక్టర్ వెంకట్రావ్, అధికారులతో సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు ప్రియాంక, వెంకట్‌రెడ్డి, నీటి పారుదల శాఖ చీఫ్ ఇంజినీర్ రమేశ్, హౌసింగ్ చీఫ్ ఇంజినీర్ ఈశ్వరయ్య, ఆర్డీఓ జగదీశ్వర్‌రెడ్డి, పీడీ కిరణ్‌కుమార్, డీపీఓ యాదయ్య, సీపీఓ వెంకటేశ్వర్లు, మున్సిపల్ చైరపర్సన్ గెల్లి అర్చన, ఎంపీపీ గూడెపు శ్రీనివాస్, తాసీదార్లు నాగార్జునరెడ్డి, శ్రీదేవి, మంగ, జ్యోతి, కవిత, మున్సిపల్ కమిషనర్లు శ్రీనివాస్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, సీడీపీఓ విజయలక్ష్మి పాల్గొన్నారు.

# ప్రజా సంక్షేమమే ఎజెండాగా పాలన అందించాలి

- సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి




పెన్‌పహాడ్ మండల సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి

పెన్‌పహాడ్, డిసెంబర్ 23 : ప్రజా సంక్షేమం, అభివృద్ధే ఎజెండాగా ప్రజా ప్రతినిధులు పాలన అందించాలని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి సూచించారు. పెన్‌పహాడ్ మండల పరిషత్ కార్యాలయంలో శనివారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. తన పదేండ్ల పాలనలో ఉమ్మడి నల్లగొండ జిల్లాలో పార్టీలకతీతంగా ప్రజాప్రతినిధులు, ప్రజల అవసరాలను గుర్తించి అభివృద్ధి, సంక్షేమ ఫలాలు అందించానన్నారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ నేతృత్వంలో కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణను కాపాడుకోవాలని, అందుకోసం తన వంతు సహకారం అందిస్తానని అన్నారు. నిర్మాణాత్మక తెలంగాణ కోసం అవసరమైతే రాష్ట్ర ప్రభుత్వానికి తన వంతు సలహాలు, సూచనలు అందిస్తానని తెలిపారు. ప్రజా వ్యతిరేక పాలన అందిస్తే పోరాటం చేయడానికి సిద్ధమన్నారు. ప్రజాప్రతినిధులు మెరుగైన పాలన అందించాలని సూచించారు. అనంతరం హ్యాట్రిక్ విజయం సాధించి మొదటిసారిగా మండలానికి వచ్చిన ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డిని ప్రజాప్రతినిధులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీపీ నెమ్మాది భిక్షం, జడ్పీటీసీ మామిడి అనిత, వైస్ ఎంపీపీ గార్లపాటి సింగారెడ్డి, పీఏసీఎస్ చైర్మన్లు వెన్న సీతారాంరెడ్డి, జానకిరాంరెడ్డి, తాసీల్దార్ మహేందర్‌రెడ్డి పాల్గొన్నారు.



నల్లగొండలో శనివారం తెల్లవారుజామున కురుస్తున్న మంచు

# గజగజ

- రోజురోజుకూ పడిపోతున్న ఉష్ణోగ్రతలు
- రాత్రివేళల్లో తీవ్ర చలిగాలులు
- జిల్లాలో కనిష్ఠంగా 11 డిగ్రీలు నమోదు

యాదాద్రి భువనగిరి, డిసెంబర్ 23 (నమస్తే తెలంగాణ) : చలి పంజా విసురుతున్నది. ఉష్ణోగ్రతలు రోజురోజుకూ పడిపోతుండడంతో వణుకు పెరుగుతున్నది. రాత్రివేళ శీతల గాలులతో ఇగం చంపేస్తున్నది. వారం రోజులుగా వాతావరణంలో తీవ్ర మార్పులు వచ్చాయి.

దాంతో ఒక్కసారిగా చలి తీవ్రత పెరిగింది. ఉష్ణోగ్రతలు అంతకంతకూ పడిపోతున్నాయి. ముఖ్యంగా రాత్రి ఉష్ణోగ్రతలు సాధారణం కంటే మూడు నుంచి నాలుగు డిగ్రీల మేర తక్కువ రికార్డ్ అవుతున్నాయి. శుక్రవారం రాత్రి నుంచి శనివారం ఉదయం వరకు యాదాద్రి భువనగిరి జిల్లాలో 11.4, నల్లగొండలో 11.45, సూర్యాపేట జిల్లాలో 14.7 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

పగటి ఉష్ణోగ్రతలు సైతం పడిపోతున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో మంచు దట్టంగా కురుస్తుండగా.. ఉదయం తొమ్మిదైనా సూర్యుడు కనిపిస్తలేడు. ఉదయం తప్పనిసరిగా బయటకు వెళ్లాల్సి వచ్చే పాల వ్యాపారులు, కూరగాయల రైతులు, కార్మికులు, కూలీలు చలితో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ క్రమంలో వ్యాధులు ప్రబలకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు.

# ప్రజాప్రతినిధులు చెప్పినా పట్టించుకోరా?

- పాఠశాలలకు వచ్చే సన్న బియ్యం నాణ్యంగా ఉండాలి
- విద్యుత్ శాఖ అధికారులు స్పందించకపోతే అంధకారమైతది
- జడ్పీ సర్వసభ్య సమావేశంలో పలువురు సభ్యుల ప్రశ్నలు
- అధికారులు ప్రజలకు జవాబుదారీగా ఉండాలి
- జడ్పీ చైర్మన్ బండ నరేందర్‌రెడ్డి




జడ్పీ సమావేశంలో మాట్లాడుతున్న జడ్పీ చైర్మన్ నరేందర్‌రెడ్డి

నల్లగొండ, డిసెంబర్ 23 : అధికారులు విధుల పట్ల నిర్లక్ష్యంగా ఉండడం తగదని, ప్రజా సమస్యలపై ప్రజాప్రతినిధులు చెప్పినా పట్టించుకోరా? అని పలువురు సభ్యులు ప్రశ్నించారు. నల్లగొండ జిల్లా పరిషత్‌లో చైర్మన్ బండ నరేందర్‌రెడ్డి అధ్యక్షతన శనివారం జరిగిన జడ్పీ సర్వసభ్య సమావేశంలో సభ్యులు అధికారులను నిలదీశారు. పాఠశాలల్లోకి వచ్చే సన్న బియ్యంలో నాణ్యత లేకపోవడంతోపాటు తక్కువగా వస్తున్నాయని ఎమ్మెల్సీ నర్సిరెడ్డి ప్రస్తావించారు. పలు పాఠశాలల్లో తాను చేసిన తనిఖీల్లో ఈ విషయం బయటపడ్డట్లు తెలిపారు. దీనికి మద్దతుగా జడ్పీ చైర్మన్ నరేందర్‌రెడ్డి సైతం పాఠశాలలకు పంపే సన్న బియ్యంలో నాణ్యత లేదని, వంట చేసిన తర్వాత గంజి ఎందుకు పడుతుందని ప్రశ్నించారు. దీనిపై పలువురు సభ్యులు సైతం ఏకరువు పెట్టారు. అసలైన దివ్యాంగులకు పింఛన్ ఇవ్వకుండా అనర్హులకు ఇస్తున్నారని చైర్మన్ నరేందర్‌రెడ్డితోపాటు పలువురు సభ్యులు వైద్యాధికారులను నిలదీశారు. సదరం సర్టిఫికెట్లలో మాయాజాలం జరుగుతున్నదని ఆరోపించారు. విద్యుత్ శాఖ యంత్రాంగం నిర్లక్ష్యంతో వ్యవసాయానికి పూర్తిస్థాయిలో కరెంట్ సరఫరా కావడం లేదని, ఎల్‌సీల పేరుతో గంటల తరబడి కోతలు విధిస్తున్నారని పేర్కొన్నారు. మర్రిగూడలో కోటి రూపాయలతో నిర్మిస్తున్న పీఆర్ రోడ్డులో నాణ్యత లేదని, అధికారులు ఎందుకు పర్యవేక్షణ చేయడం లేదని ప్రశ్నించారు. నార్కట్‌పల్లి - మాండ్ర మధ్య రోడ్డుకు ఎస్టిమేషన్ తక్కువగా వేయడంతో కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదని, దాన్ని రీ ఎస్టిమేషన్ వేసి రోడ్డు నిర్మాణం పూర్తి చేయాలని కోరారు. మునుగోడులోని సెయింట్ జోసెఫ్ స్కూల్‌లో విద్యుత్ చోరీ జరుగుతుంటే అధికారులు ఎందుకు కేసులు నమోదు చేస్తలేరని ఎంపీపీ సభ దృష్టికి తీసుకొచ్చారు. నల్లగొండ మండలం చెన్నుగూడెంలో నలుగురు విద్యార్థులకు ఇద్దరు టీచర్లు ఉంటే రాములబండలో 24 మంది విద్యార్థులకు ఒక్క టీచర్ ఉండటమేందని, అక్కడ సర్దుబాటు చేయకుండా ఏడాది కాలంగా ఎందుకు నిర్లక్ష్యం వహిస్తున్నారని జడ్పీటీసీ నిలదీశారు.

### అధికారులు ప్రజలకు జవాబుదారీగా ఉండాలి : జడ్పీ చైర్మన్

అధికారులు ప్రజలకు జవాబుదారీగా ఉండాలని జడ్పీ చైర్మన్ బండ నరేందర్‌రెడ్డి సూచించారు. గత సర్వసభ్య సమావేశంలో సభ్యులు లేవనెత్తిన సమస్యలను ఎందుకు పరిష్కరించలేదని ఆయన పలు శాఖల అధికారులను ప్రశ్నించారు. బియ్యం రీసైక్లింగ్ చేసినవి ఇవ్వడంతోనే నాణ్యత ఉండడం లేదని, క్వాంటిటీ కూడా తక్కువగా వస్తున్నదని, వాటిని క్షేత్రస్థాయిలో తూకం వేయాలని అధికారులకు సూచించారు. అనంతరం ఎమ్మెల్సీ నర్సిరెడ్డి మాట్లాడుతూ పాఠశాలకు బియ్యం తీసుకెళ్లే వాహనంలోనే తూకం మిషన్ పంపిస్తే అక్కడే తూకం వేస్తారన్నారు. వేములపల్లి మండలం చిరుమర్తి, చర్లగూడెం గ్రామాల్లోని పాఠశాలలకు నిధులు వచ్చినప్పటికీ ఎందుకు పనులు చేయడం లేదని ప్రశ్నించగా, అక్కడ కాంట్రాక్టర్ లేకపోవడంతో రీ టెండర్ పిలుస్తున్నట్లు తెలిపారు. విద్యా వ్యవస్థ అస్తవ్యస్తంగా తయారవుతున్నదని, పిల్లలు లేని చోట టీచర్లు పని చేస్తుండగా, పిల్లలు ఉన్నచోట టీచర్లు లేరని, ఆయా ప్రాంతాల్లో సర్దుబాటు చేయాలని దేవరకొండ ఎమ్మెల్యే బాలూనాయక్ అధికారులకు సూచించారు. కడపర్తి, నకిరేకల్‌లో తాటికల్ రోడ్డు వేయించాలని ఆర్అండ్‌బీ యంత్రాంగానికి నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం సూచించారు. సభ్యులు లేవనెత్తిన సమస్యలను త్వరలోనే పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ తెలిపారు. సమావేశంలో నాగార్జునసాగర్, మిర్యాలగూడ ఎమ్మెల్యేలు జైవీర్‌రెడ్డి, బత్తుల లక్ష్మారెడ్డి, జడ్పీ సీఈఓ ప్రేమ్‌కరణ్‌రెడ్డి, జడ్పీటీసీలు పాల్గొన్నారు.



సమావేశానికి హాజరైన ఎమ్మెల్సీ నర్సిరెడ్డి, ఎమ్మెల్యేలు బాలూనాయక్, బీఎల్ఆర్, జైవీర్ రెడ్డి, వేముల వీరేశం